సాక్షి
జనగామ
ఆదివారం | 23 | జూలై | 2023



పోలీస్‌శాఖలో ఎన్నికల ఎఫెక్ట్
రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి అనధికారికంగా ప్రారంభమైంది. ఎన్నికల సమయంలో కీలకపాత్ర పోషించే పోలీస్‌శాఖలో భారీగా మార్పులు చేస్తున్నారు. - 8లో▸



ప్రవాహ పరవళ్లు
కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం(సరస్వతీ) బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది. అధికారులు బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0°/25.0°
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి.

న్యూస్‌రీల్

‘పీఎంవైఎస్’ను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం యశస్వి స్కాలర్‌షిప్(పీఎంవైఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9 నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, 11వ తరగతికి రూ.1,25,000 స్కాలర్‌షిప్ ఇస్తారని, ఓఎంఆర్ పద్ధతిలో రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, సెప్టెంబర్ 29న పరీక్ష ఉంటుందన్నారు. 100 ప్రశ్నలు, 150 నిమిషాల సమయం ఉంటుందని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారని వివరించారు. వివరాలకు yet.nta.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి



జనగామ: మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి వంగాల కళ్యాణి, జనరల్ సెక్రటరీ సుంకరి నిర్మల, మండల మహిళా అధ్యక్షురాలు కాముని జయ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బుట్‌రెడ్డి శ్రీలతారెడ్డి, ఎండీ.మున్ని బేగం తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



జనగామ: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 49 కారుణ్య నియామకాలు చేపట్టాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రాలు అందజేశారు. వారం రోజుల్లో నియామక పత్రాలు అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. అనంతరం వారు కలెక్టర్‌తో పాటు రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు రాజనర్సయ్య హఫీజ్, సంపత్, రాజేష్, మధు, చంద్రయ్య, మనుపాటి నర్సయ్య, నాగార్జున, ప్రభాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి తామరపూలతో అర్చన



జనగామ: పట్టణ పరిధి బాణాపురం శ్రీ వెంకటేశ్వర ఆలయంలో శనివారం గోదాదేవికి తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీమదుభయ వేదాంతాచార్య పీఠం ఆధ్వర్యాన ఆలయ ప్రధాన అర్చకులు సంపత్‌కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి పర్యవేక్షణలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి వేయి తామరపుష్పాలతో అర్చన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఒడి బియ్యం పోసి కానుకలు సమర్పించారు.

‘డబుల్’ ట్రబుల్



దేవరుప్పుల : అధికారుల పర్యవేక్షణ కొరవడింది.. కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ఫలితంగా డబుల్ బెడ్రూం నిర్మాణ పనులకు బ్రేక్ పడడంతో నిలువ నీడ కోల్పోయిన దళిత కుటుంబాలు అవస్థల పాలవుతున్నారు. మండల పరిధి మాధాపురం ఎస్సీకాలనీ దళితులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎనిమిది నెలల క్రితం 30 ఇళ్లు మంజూరు చేశారు. గ్రామ శివారులో ఉచిత స్థలాన్ని కాదనీ సొంత స్థలంలో లబ్ధిదారుల కోరిక మేరకు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. అవి పునాదుల వరకే పరిమితం అయ్యాయి. వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో లబ్ధిదారులు కనీస వసతి లేక పిల్లర్లకే పరదాలు కట్టుకొని వంట చేసుకుంటున్నారు.

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



సాక్షి ఫోకస్

జనగామ: పట్టణంలోని హనుమకొండ రోడ్డులో ఓపెన్ డ్రెయినేజీ నాలా వద్ద పేరుకుపోయిన చెత్త



జ్వరం.. జర పైలం

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ధ్వంసమైన డ్రెయినేజీ



నాలుగురోజులుగా జ్వరంతో..



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు మాతంగి వెంకటయ్య. స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీకాలనీకి చెందిన ఈయన జ్వరం బారిన పడ్డాడు. కాలనీలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ లేకపోవడంతో దోమల స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో వెంకటయ్యతో పాటు కాలనీలోని చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు.

సాధారణ జ్వరాలే..



జ్వరంతో ఎలేంద్ర

నర్మెట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలు పెరిగాయి. ఇన్‌పేషెంట్లు ఎవరూ లేరు. ఇంటింటి సర్వేలో గుర్తించిన జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తున్నారు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న గడ్డం ఎలేంద్రకు శనివారం రక్త పరీక్ష చేయగా సాధారణ జ్వరమని తేలింది.

ఎక్కడి మురుగు అక్కడే..!

- కాల్వల్లో పేరుకుపోయిన చెత్త
- అధ్వానంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ
- రహదారులపై పారుతున్న డ్రెయినేజీ నీరు
- జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- జీపీ కార్మికుల సమ్మెతో పరిస్థితి జఠిలం
- కొనసాగుతున్న ఇంటింటి సర్వే

జనగామ: ఓ వైపు గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె.. మరోవైపు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది. వీధుల్లో చెత్త పేరుకుపోతుండగా.. డ్రెయినేజీలను శుభ్రం చేసేవారు లేకుండా పోయారు. కాల్వల్లో చెత్తా చెదారం నిండిపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. దుర్వాసనతోపాటు దోమలు, ఈగలు, క్రిమి కీటకాలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు లేవు. అక్కడక్కడా సర్పంచ్‌లు, ఇతరులు చెత్త సేకరణ పనులు చేపడుతున్నా.. తాత్కాలిక సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడంలేదు. పల్లె, పట్టణం తేడా లేకుండా సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబు, విరేచనాలతో ప్రజలు బాధపడుతున్నారు. నిత్యం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రికి వచ్చే బాధితుల సంఖ్య పెరుగుతోంది.

ఈనెల ఒకటి నుంచి ఆస్పత్రుల్లో నమోదైన ఓపీ, సర్వే వివరాలు

- ఓపీ : 17,355
- అడ్మిట్ : 719
- రక్తం పరీక్షలు : 273
- సాధారణ జ్వరాలు : 555
- ఇంటింటి సర్వే వైద్య బృందాలు : 449
- సర్వే పూర్తయిన గృహాలు : 35,378

ఇంటింటా ఫీవర్ సర్వే

జిల్లా వ్యాప్తంగా 218 జీపీలు, 400 వరకు తండాలు, శివారు గ్రామాలున్నాయి. ఇప్పటి వరకు 449 వైద్య బృందాలు 35,378 ఇళ్లలో ఫీవర్ సర్వే నిర్వహించగా.. 2,398 మందికి ఓపీ ద్వారా వైద్య పరీక్షలు చేశారు. 555 మందికి సాధారణ జ్వరాలు ఉన్నట్టు గుర్తించి అవసరమైన మందులు ఇచ్చారు. 273 మంది రక్తం శాంపిల్ సేకరించి పరీక్షించగా మలేరియా, డెంగీ లాంటి కేసులు ఏమీ నమోదు కాలేదు. ఈనెల ఒకటి నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ 17,355 నమోదవగా 719 మంది అడ్మిట్ కేసులు ఉన్నాయి. పరిస్థితి ఇలానే ఉంటే జ్వరపీడితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

జనావాసాల్లోకి డ్రెయినేజీ నీరు

స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని 15, 16వ వార్డులు, ఎస్సీకాలనీలో జనావాసాల్లోకి డ్రెయినేజీ, వర్షపు నీరు చేరింది. మరో వైపు పందులు, దోమల స్వైర విహారంతో ప్రజలు జ్వరాల బారినపడి ఆస్పత్రులకు పరుగుపెడుతున్నారు.

ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



రోజుకు 150 మందికి పైగా..

జఫర్‌గఢ్: మండల పరిధి గ్రామాల్లో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. రోజుకు 150 మందికి పైగా స్థానిక సీహెచ్‌సీకి వస్తున్నారు. వీరికి వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. డెంగీ, మలేరియా, విషజ్వరాలు ఏమీ నమోదు కాలేదు. ఇంటింటా ఫీవర్ సర్వే కొనసాగుతోంది.

మురుగు కాల్వలను వదిలేశారు



పెంబర్తి 8వ వార్డులో రోడ్డుపై మురికి నీరు

జనగామ రూరల్: జనగామ మండల పరిధి గ్రామ పంచాయతీల్లో మురుగు కాల్వల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు. చెత్తాచెదారంతో కూరుకుపోయి వరద, మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది.

14 మందికి జ్వరాలు



తరిగొప్పుల: పారిశుద్ధ్య పనుల నిర్వహణ లేకపోవడంతో మండలంలో జ్వరపీడుతుల సంఖ్య పెరుగుతోంది. అంకుషాపూర్ పరిధిలో రెండు, సోలీపూర్‌లో ఆరుగురు, తరిగొప్పులలో మరో ఆరుగురు జ్వరాలతో బాధపడుతున్నారు. అయితే ఇప్పటివరకు డెంగీ, మలేరియా టైఫాయిడ్ కేసులు నమోదు కాలేదు.

మంచం పట్టిన ఊర్లు



బచ్చన్నపేట: మండల పరిధి ప్రతి గ్రామంలో ప్రజలు జ్వరాలతో మంచంపట్టారు. వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. డ్రెయినేజీల్లోని మురుగు రోడ్డుపైకి వస్తోంది. భరించలేని దుర్గంధం. పరిసరాలు ఈగలు, దోమలకు నిలయంగా మారాయి. ఆస్పత్రికి వచ్చే బాధితుల సంఖ్య పెరుగుతోంది.

మురికి కూపాలుగా వీధులు..



లింగాలఘణపురం: మండల పరిధి వీధులన్నీ మురికి కూపాలుగా మారాయి. పారిశుద్ధ్య పనులు పూర్తిగా స్తంభించి పోయాయి. వివిధ అనారోగ్య సమస్యలతో నిత్యం 100 మందికి పైగా ప్రజలు ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. డెంగీ, మలేరియా ప్రబలే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తాత్కాలిక సిబ్బందితో..

దేవరుప్పుల: మండలంలోని 32 గ్రామాల్లో గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొంటున్నారు. తొలి వారంలో పారిశుద్ధ్య లోపాన్ని గుర్తించిన పంచాయతీ పాలకవర్గం, అధికార యంత్రాంగం, స్పెషల్ డ్రైవ్ పేరిట తాత్కాలిక సిబ్బందిని నియమించి పారిశుద్ధ్యం లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.



పారిశుద్ధ్య పనుల స్పెషల్ డ్రైవ్

మూడు రోజుల క్రితమే..



విరేచనాలతో మూడు రోజుల క్రితమే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరాను. వాతావరణంలో ఏర్పడిన మార్పులు, దోమల కారణంగా అనారోగ్యానికి గురయ్యాను. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను.
- కూరాకుల రోశయ్య, మరిగడి(జనగామ)

వాంతులు, విరేచనాలు



వాంతులు, విరేచనాలు, ఒంటి నొప్పులతో నాలుగు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రిలో చేరాను. వానలు మొదలైన నాటి నుంచి పాణం సుస్తిగా ఉంది. విరేచనాలు అధికం కావడంతో వెంటనే ఆస్పత్రికి వచ్చాను. ఇప్పుడిప్పుడే నయమైతాంది.
- ఎలకొండ గట్టమ్మ సీతారాంపూర్(దేవరుప్పుల)

దోమలే కావొచ్చు..



ఇంటిచుట్టూ దోమలు విపరీతంగా ఉన్నాయి. సాధారణ జ్వరంతో పాటు ఒంటి నొప్పులు ఉండడంతో జిల్లా ఆస్పత్రికి వచ్చిన. డాక్టర్ పరీక్షించిన తర్వాత అడ్మిట్ చేసుకున్నారు. రెండు రోజులు గడిస్తే తగ్గిపోతుందని చెప్పారు. దోమల కారణంగానే ఇలా కావచ్చు.
- జి.కళ్యాణి, కృష్ణాకళామందిర్ ఏరియా, జనగామ

సంస్కారవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

- జిల్లా జడ్జి రవీందర్ శర్మ



మాట్లాడుతున్న జడ్జి రవీందర్ శర్మ

జనగామ రూరల్: ఖైదీలు సంస్కారవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా జడ్జి రవీందర్ శర్మ అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సబ్‌జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్టాఫ్ వివరాలు, ఖైదీలకు సంబంధించి నేరాలు, సదుపాయాలను పరిశీలించడంతోపాటు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు న్యాయ సలహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు జైలులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించారు. సబ్‌జైల్ సూపరింటెండెంట్, కృష్ణకాంత్, డిఫెన్స్ న్యాయవాది రవీందర్, జ్యోత్స్న, శ్రీహరి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

లో లెవల్ కాజ్‌వేపై జాగ్రత్త..!



కాజ్‌వే వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లింగాలఘణపురం: కుందారం–పాలకుర్తి రోడ్డులోని పటేల్‌గూడెం లో లెవల్ కాజ్‌వే వద్ద నీటి మట్టం పెరుగుతోంది. జనగామలోని చీటకోడూరు రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం నెల్లుట్ల వాగు నుంచి నవాబుపేట రిజర్వాయర్‌లోకి వెళ్తున్న క్రమంలో.. పటేల్‌గూడెం కాజ్‌వే వద్ద వరద తీవ్రత అధికమైంది. శనివారం కలెక్టర్ శివలింగయ్య కాజ్‌వే వద్ద పరిశీలించి తహసీల్దార్ వినయలతకు పలు సూచనలు చేశారు. జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పాలకుర్తి వైపు వెళ్లే ప్రయాణికులను నిలిపి వేశారు. అలాగే కుందారం, చీటూరు, కిష్టగూడెం, కోలుకొండ వైపు వెళ్లే ప్రయాణికులను నేలపోగుల, చిన్నమడూరు మీదుగా మళ్లించారు.

మతిస్థిమితం లేని మహిళకు ‘సఖి’ అండ

స్టేషన్‌ఘన్‌పూర్: మానసిక స్థితి బాగోలేని ఓ మహిళను జనగామ సఖి కేంద్రం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించినట్లు జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి తెలిపారు. శనివారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. వారం రోజుల క్రితం రాత్రి సమయాన.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో గుర్తు తెలియని మహిళ ఉందని మహిళా హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు కాల్ వచ్చిందని చెప్పారు. వెంటనే సఖి సిబ్బంది అక్కడికి చేరుకుని సదరు మహిళతో మాట్లాడి సఖి కేంద్రానికి తీసుకువచ్చి రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. స్వగ్రామం పాల్వంచ, పేరు అమ్ము, ఐపీఎస్ చదవడానికి వచ్చానంటూ పొంతన లేకుండా మాట్లాడడంతో జనగామ ఆస్పత్రిలో చూపించామని తెలిపారు. మానసిక స్థితి బాగోలేదని ఎర్రగడ్డ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ చేయించి జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచిన అనంతరం జడ్జి ఆదేశాల మేరకు హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

విద్యుత్ కార్యాలయంలో కంట్రోల్ రూం

జనగామ: ఇటీవల తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరెంటు సరఫరాలో అంతరాయం, వైర్లు తెగిపడడం, స్తంభాలు నేలకొరిగిన సమయంలో కంట్రోల్ రూం నంబర్ 7901628363కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫోన్ వచ్చిన వెంటనే సహాయ చర్యలు చేపడతామని చెప్పారు.

- గండిరామవరం గేట్లు మూత
- చీటకోడూరు డ్యాం నుంచి 400క్యూసెక్కుల నీరు విడుదల
- తెగిపోయిన డ్యాం గేటు వైరు

కొనసాగుతున్న వరద ఉధృతి

జనగామ: జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లకు వరద ఉధృతి కొనసాగుతోంది. చీటకోడూరు డ్యాంకు 400 క్యూసెక్కుల వరద వస్తుండగా(ఇన్‌ఫ్లో), నాలుగు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా నర్మెట మండలం గండిరామవరం రిజర్వాయర్‌కు 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే మొత్తంలో దిగువకు విడుదల చేశారు. శనివారం వరద ఉధృతి తగ్గడంతో గండిరామవరం గేట్లను మూసివేశారు. ప్రస్తుతం చీటకోడూరు డ్యాంలో 389 మీటర్లకు గాను 389 మీటర్ల నీటి మట్టం ఉంది. గండిరామవరం రిజర్వాయర్‌లో 422 మీటర్లకు సామర్థ్యానికి 521 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి.



ఫిల్టర్‌బెడ్ వద్ద చైర్‌పర్సన్, కమిషనర్, డీఈ

ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ

రిజర్వాయర్లకు వరద ఉధృతి కొనసాగుతుండంతో ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్ ఆధ్వర్యంలో డీఈలు మంగీలాల్, రవి తదితరులు సర్కిల్ పరిధిలోని గండిరామవరం, బొమ్మకూరు, చీటకోడూరు, నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్, అశ్వరావుపల్లి, మైలారం రిజర్వాయర్ల వద్ద షిఫ్టుల వారీగా పర్యవేక్షణ చేస్తున్నారు.

తెగిన చీటకోడూరు డ్యాంగేటు వైర్

చీటకోడూరు డ్యాంకు వరద ఉధృతి ఎక్కువ కావడంతో అధికారులు రెండవ గేటు తెరిచేందుకు ప్రయత్నిస్తుండగా మొరాయించింది. అదే సమయంలో వైర్ తెగడంతో.. ఒక్కసారిగా టెన్షన్ నెలకొంది. వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టారు. మెయింటనెన్స్ లోపం కారణంగానే ఇలా జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన

జనగామ పట్టణానికి తాగునీరు అందిస్తున్న చీటకోడూరు ఫిల్టర్ బెడ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కమిషనర్ రజిత, ఇంజనీరింగ్ విభాగం డీఈ చంద్రమౌళి, ఏఈ మహిపాల్ శనివారం సందర్శించారు. తాగునీరు రంగు మారడంతో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కౌన్సిలర్ల బాట పట్టిన దుర్గాకాలనీ వాసులు



లింగయ్యకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

జనగామ: పట్టణ పరిధి సూర్యాపేటరోడ్డు దుర్గా కాలనీ వాసులు దారి కోసం శనివారం కౌన్సిలర్ల వద్దకు బాట పట్టారు. దేవాదాయ శాఖ మూసి వేసిన కాలనీ రోడ్డును తెరిపించి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ మున్సిపల్ చైర్ పర్సన్ భర్త, చాంబర్ అధ్యక్షుడు పోకల లింగయ్య, అన్ని పార్టీల కౌన్సిలర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2వ వార్డు పరిధిలో ఉన్న దుర్గానగర్ కాలనీలో 150 కుటుంబాలు ఉన్నాయని, మున్సిపల్‌తో పాటు మిషన్ భగీరథ పైపులైన్, విద్యుత్ శాఖ అనుమతులతో ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. కాలనీకి 36, 30 పీట్ల రోడ్లు ఉండగా, దుకాణాల ఎదుట 15 పీట్ల వెడల్పుతో స్థలం ఉందని పేర్కొన్నారు. ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు వచ్చి దేవుని మాన్యం అంటూ రోడ్డును మూసి వేశారని, దీంతో చాలా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దారి సౌకర్యం కల్పించేలా చూడాలని కోరారు.

జనగామ రైల్వేస్టేషన్‌లో పట్టాలపై కోతులు



పట్టాలెక్కిన వానర సైన్యం

జనగామ రైల్వేస్టేషన్‌లో వానర సైన్యం శనివారం పట్టాలపై పరుగులు పెట్టాయి. రెండు రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న రైల్వే డీఆర్ఎం భరతేష్‌కుమార్ జైన్ స్థానిక రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసే సమయంలో కోతులు మొదటి, రెండవ ప్లాట్‌ఫాం పట్టాలతో పాటు లూప్‌లైన్‌పై ఇలా ప్రదర్శన ఇచ్చాయి. స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు వాటిని ఓ వైపు ఆసక్తిగా తిలకిస్తూనే.. అమ్మో కోతులు అంటూ భయపడడం కనిపించింది. - జనగామ

సిబ్బంది సంక్షేమానికి కృషి : సీపీ



మాట్లాడుతున్న సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తించే సిబ్బంది సంక్షేమానికి కృషిచేస్తానని, వారికి నిరంతరం అందుబాటులో ఉంటానని పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. భీమారంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఆర్మ్డ్ రిజర్వ్, హోంగార్డ్స్ సిబ్బందితో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా సీపీ మాట్లాడుతూ నక్సల్స్ నియంత్రణలో వరంగల్ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్, టీఏ, బకాయిలు త్వరలోనే అందుకుంటారని ఆయన తెలిపారు. విధుల్లో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా అవకాశాన్ని బట్టి వెసులుబాటు కల్పించనున్నట్లు, ప్రతి నెలా సిబ్బంది సంక్షేమం కోసం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సిబ్బంది సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చే విధంగా విభాగాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. డాక్టర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలతో మాట్లాడి రాయితీలు కల్పిస్తామని, 40 సంవత్సరాలు పైబడిన వారికి మాస్టర్ హెల్త్ చెకప్, ఆకస్మికంగా మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం కింద ఒక రోజు వేతన పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. హోంగార్డు సిబ్బంది గ్రూపు ఇన్సూరెన్స్ కోసం సంబంధిత కంపెనీలతో మాట్లాడానని చెప్పారు. పరిపాలన విభాగం డీసీపీ పుష్పారెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ అధికారి అంకిత్, అదనపు డీసీపీలు సంజీవ, సురేష్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, ఏఓ ఆర్ కే.స్వామి, ఆర్ఐలు చంద్రశేఖర్, నగేష్, భాస్కర్, సతీష్, కేయూ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్, పరిపాలన విభాగం సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.





కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపం నుంచి తరలిపోతున్న వరదనీరు

గోదావరి పెరుగుతూ.. తగ్గుతూ

జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు పెరుగుతూ.. తగ్గుతూ ప్రవహిస్తున్నాయి. శనివారం సాయంత్రం కాళేశ్వరం పుష్కరఘాటు వద్ద 11.150మీటర్లు ఎత్తులో నీటి మట్టం ప్రవహిస్తోంది. ఎగువన గోదావరి, ప్రాణహిత నదుల గుండా వరద అర్ధరాత్రి నుంచి పెరిగి శనివారం ఉదయం 10గంటల వరకు 11.520మీటర్లు ఎత్తులో ప్రవహించింది. తరువాత తగ్గుతూ సాయంత్రం 6గంటల వరకు 11.150మీటర్లకు చేరింది. ఎగువ తెలంగాణ, మహారాష్ట్రల నుంచి వరద నీరు తరలి వచ్చి కాళేశ్వరం మీదుగా దిగువన మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వైపునకు తరలిపోతోంది.

- కాళేశ్వరం

పోలీస్ శాఖలో ఎన్నికల ఎఫెక్ట్



- ఉన్నతాధికారుల బదిలీ
- భారీగా ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్
- నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు!
- బదిలీలకు ఈనెల 31 టార్గెట్

వరంగల్ క్రైం: పోలీసుశాఖలో బదిలీలు భారీగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి అనధికారికంగా ప్రారంభమైంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీసీపీ స్థాయి అధికారి నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ అధికారి వరకు ఎన్నికల ఎఫెక్ట్‌లో భాగంగా బదిలీలు జరుగుతున్నాయి. జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనరేట్ల కమిషనర్లు, ఎస్పీలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు. దీంతో ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. దీనికి అనుగుణంగా ఎన్నికల సమయంలో కీలకపాత్ర పోషించే పోలీస్ శాఖలో భారీగా మార్పులు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారుల ఎంపిక విషయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు మార్గనిర్దేశం చేసినట్లు సమాచారం. దానికి అనుగుణంగా ఎన్నికల నిబంధనలు వర్తించే పోలీస్ అధికారులను ఆయా నియోజకవర్గాలకు సాగనంపుతున్నారు. దీంతోపాటు ఎన్నికల సమయంలో సామాజిక సమీకరణాలతో పాటు ఏమేరకు ఎన్నికల విధుల్లో ఉపయోగపడుతారనే కోణంలో క్షుణంగా పరిశీలించిన తర్వాతనే పోస్టింగ్‌లకు సిఫార్సు చేస్తున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల బదిలీ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేసే ఇద్దరు డీసీపీలు పుల్లా కరుణాకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా, కర్రి పుష్పారెడ్డి తెలంగాణ కమాండ్ కంట్రోల్ విభాగం ఎస్పీగా బదిలీ అయ్యారు. వీరితో పాటు పరకాల, కాజీపేట, మామునూరు, క్రైం, ఏసీపీలు బదిలీ అయ్యారు. ఇన్‌స్పెక్టర్లు.. పరకాల, గీసుకొండతో పాటు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. దీంతోపాటు చాలా కాలంగా ఖాళీగా ఉన్న హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లకు ఖమ్మం, కొత్తగూడెం నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు కేటాయించారు. కోడ్ ఎఫెక్ట్‌లో భాగంగా సుబేదారిలోని రూరల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, భరోసా ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. గత నాలుగైదు రోజుల్లో వరుసగా సబ్ ఇన్‌స్పెక్టర్లను వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు!

ఎన్నికల ముందు ప్రశాంతత కోసం కొంత మంది అధికారులు లూపులైన్ల కోసం ప్రయత్నాలు సాగిస్తుండగా.. మరికొంత మంది ఎన్నికల కోడ్ వర్తించని చాలామంది అధికారులు సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసమయంలో నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఏమేరకు ఉపయోగపడతారని వారి అనుచర గణంతో లెక్కలు వేసుకుంటున్నారు. అధికారి పనితీరుతో పాటు సామాజిక అంశాన్ని ప్రధానంగా చూస్తున్నారు. ఒక్కో పోస్టింగ్ కోసం పదుల సంఖ్యలో అధికారులు క్యూ కట్టడం విశేషం. ఏసీపీ పోస్టుల కోసం కూడా అధికారులు ఒక్కో ప్రజాప్రతినిధిని పలుమార్లు కలుస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న కొంత మంది అధికారులు వారి పీరియడ్ పూర్తి కాకపోయినప్పటికీ పోస్టింగ్ ఉంటుందో? ఉడుతుందో.. తెలియని అయోమయ స్థితిలో ఉద్యోగం నెట్టుకొస్తున్నారు. వరంగల్ సబ్ డివిజన్‌లో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ వర్ధన్నపేట, ధర్మసాగర్, కమలాపూర్, నర్సంపేట, రఘునాథపల్లి, నర్సంపేట రూరల్, నర్మెట్ట పోలీస్‌స్టేషన్లకు కొత్త అధికారులు రానున్నారు. ఈపోస్టింగ్‌ల కోసం ఇప్పటికే చాలా మంది అధికారులు ప్రజాప్రతినిధుల నుంచి లెటర్లు పోలీస్‌బాస్‌కు అందించినట్లు సమాచారం. ఇందులో కొంత మందికి ఎలక్షన్ ఎఫెక్ట్ ఉండగా.. మరికొంత మంది ప్రవర్తన సరిగ్గా లేక మార్పు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

అరెస్టులకు రంగం సిద్ధం!

పోలీసు అధికారుల లెక్కల ప్రకారం వివిధ కేసుల్లో ఇప్పటి వరకు అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న సుమారు 180 మంది నిందితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. వీరిని అరెస్ట్ చేయడానికి ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఎస్‌హెచ్‌ఓలకు నిర్దిష్టమైన ఆదేశాలు అందాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపనున్నారు. దీంతో పాటు ఆయా పోలింగ్‌స్టేషన్ల వారీగా మాజీలతో పాటు గతంలో జరిగిన ఎన్నికల్లో ఇబ్బదులు సృష్టించిన వ్యక్తుల జాబితాలు కూడా ఆయా పోలీస్‌స్టేషన్లలో సిద్ధంగా ఉన్నాయి.

తుపాకుల జాబితా రెడీ..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తుపాకుల లైసెన్స్‌లు 230 ఉన్నాయి. ప్రస్తుతం తుపాకుల లైసెన్స్ కలిగిన వ్యక్తులు వివిధ గొడవల్లో చిక్కుకున్న, కేసులు నమోదైన వారి లైసెన్స్‌లు రద్దు చేశారు. దీంతో కమిషనరేట్ పరిధిలో 180 వరకు లైసెన్స్ తుపాకులున్నాయి. ఎన్నికల ముందు వీటిని ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. తుపాకుల లెక్కలను సైతం పోలీసు అధికారులు సిద్ధం చేసి ఉంచారు.

ఈనెల 31 వరకు ప్రక్రియ పూర్తి చేస్తాం..



కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈనెల 31వ తేదీ వరకు ఎన్నికల బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తాం. సొంత జిల్లా, సొంత నియోజవర్గం ఉన్న అధికారులతో పాటు చివరి నాలుగేళ్లలో మూడు సంవత్సరాలు ఒకే దగ్గర పనిచేసే అధికారులను నిబంధనల ప్రకారం బదిలీ చేస్తాం. ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న అధికారులను రెవెన్యూ జిల్లాను ప్రతిపాదికన బదిలీలు చేపడుతున్నాం. ఏసీబీ, క్రిమినల్ కేసులు ఉన్న అధికారులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతాం.

- ఏవీ.రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

నిర్లక్ష్యపు డ్రైవింగ్..

- అదుపు తప్పి ఆటోను ఢీకొని షాపులోకి దూసుకెళ్లిన బైక్
- తప్పిన పెను ప్రమాదం



మగ్గం వర్క్ దుకాణంలో ప్రమాద ఘటన

జనగామ: ఓ ద్విచక్రవాహనదారుడి నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల పదిమందికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శనివారం జనగామ పట్టణంలో జరిగింది. జనగామకు చెందిన ఓ యువకుడు బైక్‌పై స్వర్ణకళామందిర్ రోడ్డు వైపు అతివేగంగా వచ్చాడు. అదే సమయంలో ఓ ఆటోలో ముగ్గురు కుటుంబ సభ్యులు దశరథ, ఆయన భార్య, తన కూతురు కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చారు. దశరథ దుకాణంలోకి వెళ్లగా.. భార్య, కూతురు ఆటోలోనే ఉన్నారు. ఈ క్రమంలో బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడు అదుపుతప్పి ఆటోను ఢీకొడుతూ దుకాణం పక్కన ఉన్న ఉద్వీత మగ్గం వర్క్స్ షాపులోకి దూసుకెళ్లాడు. మగ్గం వర్క్ షాపు ఎదుట యజమాని బైక్ ఉండడంతో.. ఆటో మరింత లోపలికి వెళ్లకుండా అడ్డు తగిలింది. ఆ సమయంలో ఆటోలో ఇద్దరు, దుకాణంలో నలుగురు, బయట మరికొంత మంది ఉండగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. క్షణాల్లో జరిగిన ఘటనతో స్థానికులు భయంతో పరుగులు పెట్టారు. ద్విచక్రవాహనదారుడితోపాటు అందరూ క్షేమంగా ఉన్నారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై అరుణ్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా. స్థానిక పోలీస్ స్టేషన్, డీసీపీ కార్యాలయంతో పాటు నెహ్రూపార్కు, ఆర్టీసీ చౌరస్తా, తదితర చోట్ల కొందరు బైక్ రేసింగ్, అతివేగం డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాయిదా పడిన కేయూ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 20, 21, 22వ తేదీల్లో వాయిదా పడిన వివిధ పరీక్షల రీషెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక.. శనివారం విడుదల చేశారు. వాయిదాపడిన బీ ఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27న , 22న జరగాల్సిన పరీక్షలు ఆగస్టు 1న , బీ ఫార్మసీ 7 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న నిర్వహిస్తారు. ఫార్మ డీ మూడో సంవత్సర పరీక్షలు ఆగస్టు 9న , ఫార్మ డీ నాలుగో సంవత్సర పరీక్షలు ఆగస్టు 10వ తేదీన, ఫార్మ డీ 5వ సంవత్సర పరీక్షలు ఆగస్టు 8వ తేదీన నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

బీటెక్ (సీబీసీఎస్)

కేయూ పరిధిలో వాయిదాపడిన బీటెక్ సీబీసీఎస్ పరీక్షల వివరాలు ఇలా ఉన్నాయి. బీటెక్ రెండో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24న, బీటెక్ మూడో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25న నిర్వహిస్తారు.

బీటెక్ (నాన్ సీబీసీఎస్)పరీక్షలు ఇలా..

బీటెక్ మొదటి సంవత్సర పరీక్షలు ఈనెల 26న, బీటెక్ నాలుగో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26న, బీటెక్ మూడో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న , బీటెక్ మూడో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న, బీటెక్ రెండో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1న, బీటెక్ రెండో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు1న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మిగతా పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

ప్రవాహ పరవళ్లు..



అన్నారం బ్యారేజీలో గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు



సమ్మక్క సాగర్ వద్ద తరలుతున్న నీరు

- కాళేశ్వరం బ్యారేజీలకు భారీగా వరద నీరు
- లక్ష్మీలో 75, సరస్వతీబ్యారేజీలో 35గేట్లు ఎత్తివేత

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మి), అన్నారం(సరస్వతి)బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది. దీంతో శనివారం ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆయా బ్యారేజీల్లో గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, నాలుగు రోజుల నుంచి గోదావరి, ప్రాణహిత నదులకు వరద పోటెత్తుతోంది. ఫలితంగా కాళేశ్వరం వద్ద 11.150మీటర్ల ఎత్తులో నీటిమట్టం కొనసాగుతోంది.

35గేట్లు ఎత్తివేత:

ఎగువన ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో గేట్లు ఎత్తడంతో గోదావరి గుండా దిగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం (సరస్వతి) బ్యారేజీకి వరద తాకిడి మూడు రోజుల నుంచి పెరిగింది. ఆ బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఉండగా 35 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. గోదావరి నుంచి ఇన్‌ఫ్లో 2,25,000లక్షల క్యూసెక్కులు తరలి రాగా, గేట్లు ఎత్తడంతో దిగువకు కాళేశ్వరం వైపునకు 1,03,500లక్షల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో తరలి దిగువకు వెళ్తున్నాయి. బ్యారేజీ సామర్థ్యం 10.87 టీఎంసీలకు గాను ప్రస్తుతం 2.36 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి తరలివచ్చే నీరు దిగువన కాళేశ్వరం చేరుతోంది.

లక్ష్మీబ్యారేజీ 75 గేట్లు ఎత్తివేత

ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది, అటు గోదావరి నదుల ప్రవాహాలు కలిసి భారీ స్థాయిలో వరద నీరు లక్ష్మీబ్యారేజీకి చేరుతోంది. దీంతో ఇన్‌ఫ్లో 6,10,250లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తోంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజీలో మొత్తం 85గేట్లు ఉండగా 75 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. అవుట్‌ఫ్లో 6,10,250 లక్షల క్యూసెక్కులు దిగువకు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఉధృతిని ఇంజనీరింగ్ అధికారులు సమీక్షిస్తున్నారు.

సమ్మక్క సాగర్ వద్ద ..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. ఉదయం బ్యారేజీ వద్ద 825380 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 879450 క్యూసెక్కులకు చేరింది. దీంతో అదే స్థాయిలో బ్యారేజీలో ఉన్న 59 గేట్లను ఎత్తి దిగువకు 87450 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 82.5 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

ఫాదర్ కొలంబో కలలు సాకారం..

- ఇటలీ పోప్ దూత, భారత్–నేపాల్ రాయబారి లియోపోల్డో జిరెల్లి



ఫాదర్ కొలంబో వైద్యకళాశాల ప్రాంగణంలో భూమి పూజ చేస్తున్న పోప్‌దూత లియోపోల్డొ జిరెల్లి, ముంబయి, గోవా, కార్డినల్స్, ఓరుగల్లు పీఠాధిపతి ఉడుముల బాల

కాజీపేట రూరల్: పేదల ఆరాధ్యుడు ఫాదర్ కొలంబో కలలు సాకారం కావడం సంతోషంగా ఉందని ఇటలీ పోప్ దూత, భారత్, నేపాల్ రాయబారి లియోపోల్డో జిరెల్లి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్ బ్రిడ్జి సమీపంలో గల కొలంబో వైద్యశాల ప్రాంగణంలో శనివారం ఫాదర్ కొలంబో వైద్యవిద్యా కళాశాల ఆశీర్వాద వేడుక, బీఎస్సీ నర్సింగ్ విద్య, పారా మెడికల్ కళాశాలల భూమి పూజకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలంబో వైద్యకళాశాల వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాత్రి జరిగిన దివ్య బలిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముంబయి కార్డినల్ ఒస్వాల్డ్ గ్రాషియాస్ మాట్లాడుతూ దేశంలో మణిపూర్ ఘటనలు పునరావృతం కావొద్దన్నారు. దేశంలో మానవులు అందరూ సమానులేనని, ఒకరిపట్ల ఒకరు ప్రేమతో ఉండేలా క్రీస్తును ఆరాధించాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఫాతిమానగర్ బిషప్ హౌజ్ ప్రాంగణం నుంచి వరంగల్ మెడికేర్ ఆస్పత్రి వరకు లియోపోల్డోను ప్రత్యేక కారులో ర్యాలీగా తీసుకెళ్లారు. వరంగల్, ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోడా డామన్ కార్డినల్ పిలిప్పైరి పెత్రావో, ఏలూరు. కడప, విజయవాడ, బెల్లారి, శ్రీకాకుళం, శంషాబాద్ పీఠాధిపతులు పొలిమెర జయరావు, గాలిబాల, టి.జోసెఫ్‌రాజారాం, హెన్నీ డిసౌజ, విజయ్‌కుమార్, రాపెల్ తట్టల్, మెడికేర్ ఆస్పత్రి డైరెక్టర్ చిన్నప్ప, ఫాదర్ జో సెఫ్, కొలంబో వైద్య శాల నిర్వాహకులు, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి ఫాదర్లు, సిస్టర్లు, బ్రదర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మొగుళ్లపల్లిలో ఘటన



దుర్గేశం (ఫైల్)

మొగుళ్లపల్లి: బంధువు అంత్యక్రియలకు బయలుదేరిన ఓ వ్యక్తి.. అనంతలోకాలకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి దుర్గేశం (53) మండల కేంద్రంలోని తన బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భార్య ప్రభావతితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో మొగుళ్లపల్లి పెద్దవాగు బ్రిడ్జి వద్ద మలుపు తిరుగుతున్నాడు. చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో మండల కేంద్రం మీదుగా జమ్మికుంటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దుర్గేశం దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుతుండగా మార్గమధ్యలో దుర్గేశం మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన ప్రభావతిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు.